ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్బ్స్, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

96665 56646

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నిజామాబాద్ కామారెడ్డి



## మేడారం జాతరలో బందోబస్తు
# ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



**నిజామాబాద్ రూరల్ జనవరి, 29 (ప్రజాజ్యోతి)**

మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను గౌరవనీయులు మల్టీ జోన్--1 ఐజీపీ శ్రీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్, అలాగే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సాయి చైతన్య, ఐపీఎస్ గారు పరిశీలించారు. గత రెండు రోజులుగా మేడారం జాతర ప్రాంతంలో కొనసాగుతున్న బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం

-మిగతా 2లో..



## తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను
# తనిఖీ చేసిన ఎస్పీ

- నేరాల నివారణకు ముందస్తు నిఘా అవసరం
- ప్రజల విశ్వాసమే లక్ష్యంగా పనిచేయాలి
- పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం
- జిల్లా ఎస్పి యం రాజేష్ చంద్ర



**కామారెడ్డి ప్రతినిధి . జనవరి 29. (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర గురువారం నాడు తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది హాజరు (రోల్ కాల్), వారి క్రమశిక్షణ మరియు సమయపాలనను స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

-మిగతా 2లో..

## నిజాంసాగర్ డీ-46 కెనాల్‌లో
# బాలిక మృతదేహం

**అనుమానాలు రేకెత్తిస్తున్న ఘటన**



**బోధన్ జనవరి 29 (ప్రజాజ్యోతి)**

ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్ గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న నిజాం సాగర్ డీ--46 కెనాల్‌లో గురువారం గుర్తుతెలియని బాలిక మృతదేహం లభ్యమవడం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ ఘటన అనేక అనుమానాలకు తావిస్తోంది. కెనాల్‌లో బాలిక మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్ఐ

-మిగతా 2లో..

# నామినేషన్ కేంద్రాల పరిశీలన

## శాంతియుత ఎన్నికలపై అధికారుల దృష్టి..



# తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

తాను చెబుతున్న విషయాలు, సూచనలు సిబ్బందికి చేరుతున్నాయా లేదా మరియు ఏ మేరకు అర్థమయ్యాయో కూడా ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, మరియు రికార్డు గదులను ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా నిర్వహించాలని, కేసుల నమోదు మరియు రికార్డుల నవీకరణలో ఎలాంటి జాప్యం ఉండకూడదని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'విక్టిమ్/సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్' విధానంపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు మరియు ఫిర్యాదుదారుల పట్ల మానవీయ కోణంలో, గౌరవంగా వ్యవహరించాలని ఎస్పీ పేర్కొన్నారు. వారి సమస్యలను ఓపికగా విని, త్వరితగతిన పరిష్కరించడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాలని కోరారు. ప్రజల ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించి పరిష్కార దిశగా పనిచేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.

చివరగా, జిల్లాలో ఇటీవల జరుగుతున్న ఆస్తి సంబంధిత నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో నిరంతర పెట్రోలింగ్, గస్తీ పెంచాలని, అనుమానితులపై నిశిత నిఘా ఉంచాలని ఎస్ఐని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడరాదని, ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్. బి. సంతోష్ కుమార్, ఎస్.ఐ. స్రవంతి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల పరిశీలన

**బోధన్ జనవరి 29 (ప్రజాజ్యోతి)**

బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గురువారం బోధన్ సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియ ఎలా కొనసాగుతోందన్న అంశంపై రిటర్నింగ్ అధికారులతో సమగ్రంగా చర్చించారు. నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల హాజరు, అలాగే టి--పోల్ ఎంట్రీ విధానం అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ ప్రక్రియ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని, శాంతియుత వాతావరణం నెలకొనేలా కఠిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ




మొత్తం సజావుగా సాగేందుకు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు.

# రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ




**ఇందల్వాయి, జనవరి 29,( ప్రజా జ్యోతి న్యూస్ ):**

ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచడం ద్వారానే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమని ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ గురువారం అన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి భద్రత మాసం -2026 ను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిచ్పల్లి సిఐ మరియు జాతీయ రహదారి అధికారి మండలి (చీనూ× ) అధికారులు కూడా పాల్గొని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఇది కేవలం చట్టం కోసం కాదు మీ ప్రాణ రక్షణ కోసం అని ఏసీపి సూచించారు. వయసు నిండకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆన్లైన్



మోసాలకు గురి కాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం సిబ్బంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జక్రాన్‌పల్లి పరిధిలో పేకాటపై పోలీసుల ప్రత్యేక దాడులు

**9 మందిని అదుపులోకి తీసుకుని రూ.9,240 నగదు స్వాధీనం**

నిజామాబాద్ రూరల్: జనవరి, 29 (ప్రజా జ్యోతి)జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట నిర్మూలనలో భాగంగా పోలీస్ సిబ్బంది ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా కేశవల్లి గ్రామ పరిధిలో అక్రమంగా పేకాట ఆడుతున్న కేసుపల్లి గ్రామానికి చెందిన 9 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 9,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు జక్రాన్‌పల్లి ఎస్సై జి. మహేష్ తెలిపారు.

ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. పేకాట కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎవరైనా పేకాట నిర్వహించినా లేదా ఆడినప్పటికీ చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి. మహేష్ హెచ్చరించారు.

# నిజాంసాగర్ డీ-46 కెనాల్‌లో బాలిక మృతదేహం

ముత్యాల రమ తో పాటు పోలీస్ సిబ్బంది చేరుకుని పరిశీలించారు. అయితే బాలిక వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు గానీ, ఆచూకీ తెలిపే ఆధారాలు గానీ లభించకపోవడం మరిన్ని సందేహాలకు కారణమవుతోంది.

**బాలిక ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందినదా..?లేదా ఇది హత్య చేసి కెనాల్‌లో పడేసిన ఘటననా..?**

**ఎక్కడి బాలిక...?ఎలా ఈ ప్రాంతానికి చేరుకుంది...?**

అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానాలు లభించలేదు. ఈ ఘటనపై అన్ని పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించినట్లు సీఐ విజయ్ బాబు తెలిపారు. బాలిక ఆచూకీపై ఏ చిన్న సమాచారం లభించినా ఎడపల్లి పోలీసులకు వెంటనే తెలియజేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, బాలిక మృతదేహం లభించిన తీరుపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసును కేవలం ప్రమాదంగా కాకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటన వెనుక ఏమైనా మర్మం దాగి ఉందా..? అన్నది తేలాలంటే పూర్తి స్థాయి దర్యాప్తు తప్పనిసరిగా అవసరమని అభిప్రాయపడుతున్నారు. ఈ అనుమానాస్పద ఘటనపై పోలీసుల దర్యాప్తు ఎలా ముందుకు సాగుతుందో చూడాలి.

# మేడారం జాతరలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

కలగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. రద్దీ ప్రాంతాలు, దర్శన మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను సూచించారు.

జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులు ప్రశాంతంగా, సురక్షితంగా దర్శనం చేసుకునేలా అన్ని విభాగాల మధ్య సమన్వయంతో విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచనలు అందజేశారు.

# అక్రిడేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారు

**ఆక్రిడిటెషన్ కార్డ్ ఉంటేనే జర్నలిస్టా?**

**అంగట్లో అక్రిడేషన్ కార్డులు**

ధర్పల్లి :జనవరి/29 (ప్రజా జ్యోతి)

నిజమాబాద్ జిల్లా జర్నలిస్టులఆక్రిడిటెషన్ విషయం రాష్ట్రం లో గందరగోళం నెలకొంది. అల్లం నారాయణ చేయని పని శ్రీనివాస్ రెడ్డి ఏం చేసింది లేదు ఆక్రిడిటెషన్ ఉన్న జర్నలిస్టు లు ఆక్రిడిటెషన్ లు లేని జర్నలిస్టుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల వాహనాల పై ప్రెస్ స్టిక్కర్ తీసేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం ఆక్రిడిటెషన్ లేని వాళ్ళు వాహనాలపై స్టిక్కర్ తొలగించడాని ప్రత్యేక జీవో తీసుకురావడం హాస్యాస్పదమని జర్నలిస్టు లు అంటున్నారు. రాష్ట్రం లో అనేక ప్రింట్ , ఎలెక్ట్రానిక్, మీడియా లు ఉన్నాయని కానీ ప్రభుత్వం కొన్ని ప్రధాన పత్రికలకు ఆక్రిడిటెషన్లు ఇవ్వడం మిగత జర్నలిస్టులకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వార్డ్ మెంబర్ల నుంచి సీఎంల వరకు సభలో మీటింగ్లు జరిగినప్పుడు ఎలక్ట్రానిక్ మీడియా వారు తమ సంస్థ యొక్క లోగో తొ బైట్ తీసుకుంటే గంటలకొద్ది ఉపన్యాసాలు దంచుతారు మరి అక్రిడేషన్ అడిగితే ఎందుకు ఇయ్యరు వారు బైట్ మాట్లాడే ముందు అక్రిడేషన్ఉందా అని అడగాలి కదా రేవంత్ రెడ్డి తన మాటలను వెనక్కి తీసుకోవాలని అన్ని మీడియా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి పత్రిక, మీడియా లో పని చేస్తున్న అందరి జర్నలిస్టులకు ఆక్రిడిటెషన్ లు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని జర్నలిస్టుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి అంగట్లో అక్రిడేషన్ కార్డులువర్కింగ్ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్రిడిటెషన్ కార్డులు మంజూరు చేస్తున్న కొన్ని పత్రిక యాజమాన్యాలు 5 వేల నుండి 10 వేల వరకు జర్నలిస్టుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కానీ అన్ని పేపర్లను పేపర్ల సంస్థలను ఒకే కంటితో చూడకపోవడం సబబు కాదని జర్నలిజం అంటే నిజాన్ని నిర్భయంగా చెప్పే సంస్థలు ఎన్నో ఉన్నాయి కొన్ని పేపర్ల సంస్థల వారి వల్ల కలిగే విమర్శల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సబబు కాదని జర్నలిస్టుల సంఘాలు వాపోతున్నాయి

# ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం..

**నాగిరెడ్డిపేట్,జనవరి29(ప్రజాజ్యోతి):**
నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల రాం ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వెనుకబడిన పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలనే దృక్పథంతో 2026-27 సంవత్సరానికిగాను ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులకు ప్రకటన జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ చక్కటి అవకాశాన్నిమండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ్స్త్రఎర్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ ను సందర్శించాలన్నారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు రుసుం ఓసీ లకు రూ.200 కాగా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 9 నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఏప్రిల్ 19న ఆరవ తరగతికి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుండి 12 గంటల వరకు, ఏడవ తరగతి నుంచి పదవ తరగతికి మధ్యాహ్నం




2నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. అర్హత గల విద్యార్థులందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# అడవి బిడ్డల ఆత్మగౌరవ పండుగ మేడారం

**-- నేడు వన దేవతల నిండు జాతర**

**-- గుమ్మడి లక్ష్మీనారాయణ, ఆదివాసీ రచయితల వేదిక**

**రామారెడ్డి జనవరి 29 (ప్రజా జ్యోతి)**



ఆదివాసీ అస్థిత్వం మేడారం జాతర. వారి పోరాటానికి చిహ్నం. అది జాతర మాత్రమే కాదు. ఆదివాసీల ఆత్మ గౌరవానికి ప్రతీక, గిరిజనుల స్వయంపాలనకు దిక్సూచి అయిన మేడారం జాతర ప్రతీ రెండేళ్ల కొకసారి జరుగుతుంది. అమ్మతల్లుల జాతరలో ఆదివాసీలే కాదు, సకల జనులు భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారు. జాతర నాలుగు రోజులు.సత్తెం గల సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లిస్తూ సంప్రదాయ వంటకాలను నైవేద్యంగా పెడుతూ... మరో లోకాన్ని సృష్టిస్తారు. ఇటువంటి జనజాతరకు ఎప్పటి నుంచో జాతీయ హటరీదా కల్పించాలని భక్తులూ, రాష్ట్రప్రభుత్వం ఎన్నో రోజుల నుంచి కోరుతున్నది. ఆ కల ఇంకా నెరవేరనేలేదు.

అస్థిత్వ సంస్కృతి వెలిసింది...!

ములుగు జిల్లా మేడారంలో 'సమ్మక్క- సారలమ్మ' జాతర జరుగుతుంది. ఈ గిరిజన జాతర నేడు కుల, మత, ప్రాంత భేదం లేని సకలజనుల జాతరగా మారింది. రెండేళ్లకొకసారి జరిగే జాతరను గత ప్రభుత్వం ఆదాయ వనరుగా భావించింది తప్ప.. గిరిజనులకు లాభం చేకూర్చే సంగతి పట్టించుకోవడంలేదు. నేడిది వందేళ్ల చరిత్రకు సుస్థిరతను సంతరించుకుంది. ఆదివాసీలకు మతాచారాలు లేవు. విగ్రహారాధన లేదు. కానీ కోటిన్నర మంది భక్తులు సులభంగా దర్శించుకునేలా . నేటి ప్రజా ప్రభుత్వం రూ. 251 కోట్లు కేటాయించి వనదేవతల గద్దెల పునద్దరణ పనులు పూర్తి చేసి ఆధునీకరించింది. ఆదివాసీ సాంస్కృతిక మూలాలైన కోయ గిరిజనుల గొట్టు గోత్రాలు, వారు ఆరాధించే పవిత్ర జంతువులు, పక్షులు, ఇతర చిహ్నాలు కలిపి 7000 చిత్రాలను రాతి స్తంబాలపై చెక్కించారు. పూర్తి ఆదివాసీ సంస్కృతి ప్రతిభింబించేలా రాజకీయ నాయకులు, గిరిజనేతరులు, అధికారుల జోక్యం తగ్గింది. పూజాకార్యక్రమాలు ఆదివాసీ సంస్కృతిలో నిర్వహించేలా దేవాదాయ, ధర్మాదాయశాఖ జోక్యం తగ్గించి కోయ జాతి వడ్డెలకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రాంగణంలో పసుపు, కుంకుమ, అడవి పూల అలంకరణ, పారేటాకుల భోజనం, ప్రసాదంగా బెల్లం (బంగారం) ఇప్పుడిప్పుడే దర్శనమిస్తున్నాయి. ఎండోమెంట్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంస్కృతిలో జాతర నిర్వహించడం తొలిసారి. సమ్మక్క సారక్కలకు రాజకీయ నాయకులు, వీఐపీలు, అధికారులు చిలుకలగుట్ట, ఆలయంలోకి దర్శనం కోసం గిరిజన వడ్డె (పూజారి)ల అభ్యంతరాలను పట్టించు కోకుండా పాదరక్షలతో ప్రవేశించిన గతానుభవాలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్త పడుతున్నారు. సమ్మక్క ఆగమన సమయంలో తూతకొమ్ము శబ్దంతో పాటు తుపాకీ శబ్దం కూడా లాంఛనంగా పాటించనున్నారు.

గిరిజన సంక్షేమం కాపాడాలి...!



జాతర నిర్వహణలో భాగంగా గిరిజన సంస్కృతి, పరిరక్షణ కోసం ఏర్పాటైన 'ట్రస్టుబోర్డ్ కమిటీ' లో ఛైర్మన్, ముగ్గురు డైరెక్టర్లు మినహా మిగిలిన వారంతా గిరిజనేతరులే ఉండటం ఆక్షేపణీయం. జాతర ఆదాయ వనరు కావడంతో గిరిజనేతరుల వలసలు పెరిగి స్థానిక నాయకుల ప్రమేయంతో 1/70 చట్టానికి విరుద్ధంగా భూములు కొనుగోలు చేసి, కొందరు భవనాలు నిర్మించారు. జాతర జరిగే ఏడాదికి ఆదివాసులు నష్టపోతున్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి. జాతర నిర్వహణ పర్యవేక్షణకు ఆదివాసీ అధికారులకు బాధ్యత అప్పగించాలి. మేడారంతో పాటుగా మిగిలిన వనదేవతల స్వస్థలాలైన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బయ్యక్కపేట, కన్నెపల్లి, కొండాయి, పూనుగొండ్ల గ్రామాల్లో శాశ్వత అభివృద్ధికి పనులు చేపట్టాలి. 14 మంది వడ్డెల కుటుంబాలకు ఇచ్చే 1/3 వంతు వాటాధనాన్ని పెంచాలి. మిగిలిన జాతర ఆదాయాన్ని ఆదివాసీల సంప్రదాయిక వారసత్వాలను గౌరవించి స్థానిక ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కేటాయించాలి. 1995 లో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఈ జాతరకు ఒకరోజు సెలవు (కాంపెన్సేటరీ హాలిడే)గా కాకుండా కనీసం రెండు రోజులైనా సాధారణ సెలవు ప్రకటించాలి.
వనదేవతల భిన్న కథనాలను సవరించి ప్రభుత్వమే ఆదివాసీ మేధావుల ఆధ్వర్యంలో రణ క్షేత్రం మేడారం డాక్యుమెంటరీ చిత్రం నిర్మించాలి. ఎందుకంటే - నిజానికి సమ్మక్క, సారక్కలు...ధీర వనితలు, ధిక్కార శూరులు, పోరాట శక్తులు. మహిమాన్విత శక్తులతో వారిని కేవలం దేవతలు అంటున్నారు. దైవత్వానికి పరిమితం చేస్తున్నారు. న్యూజిలాండ్ ఆదివాసీ మావోరీలు మేడారంలో చేసిన ఉగ్రరూప నృత్యం వనదేవతల పరాక్రమ శక్తికి ప్రతిరూపం. పరాధీనతపై విల్లంబులు ఎత్తిన పరాక్రమ శూరులు. కాబట్టి నవీనీకరణలో, చరిత్రలో వారి పోరాట శక్తి రూపాలు కూడా ప్రదర్శించాలి. అప్పుడే ఆదివాసీల శక్తి యుక్తులు లోకానికి తెలుస్తాయి.



## సి సి రోడ్డు పనులు ప్రారంభించిన పాలకవర్గం



**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 29**
బీబీపేట మండల కేంద్రంలో గురువారం రోజున కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి సహకారంతో సిసిఆర్ నిధుల ద్వారా మాల పోచమ్మ ఆలయం నుండి బల్ల పోచయ్య ఇంటి వరకు సర్పంచ్ స్వాత్విక సాయి సి సి రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సాత్విక మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అన్ని విధాల అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు మా పాలకవర్గంతో కలిసి ఎల్లవేళలా కృషి చేస్తామని సర్పంచ్ తెలియజేశారు. ఇట్టి అభివృద్ధికి సహకరించి న కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి రమణారెడ్డికి గ్రామ పంచాయతీ పాలకవర్గం తరఫున ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ఎదుల్ల సాత్విక సాయి,ఉప సర్పంచ్ ప్రశాంత్,వార్డు సభ్యులు మౌనిక, రేవతి, దేవరాజు, సతీష్, రంజిత్ గౌడ్ మరియ భారతీయ జనతా పార్టీ నాయకులు నక్క రవీందర్, సూరు సురేష్, నరేందర్, శివ మహేష్,సతీష్,నర్సింలు, నారాయణ, నర్సయ్య, మల్లేష్ మరియు బి జె పి నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

**రాజంపేట జనవరి 29 (ప్రజా జ్యోతి)**



రాజంపేట మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బుధవారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాలోత్ నవీన్ (25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మాలోత్ నవీన్‌కు తన భార్య విషయమై మాలోత్ ప్రకాష్, అంబ్రియా, పోలి, శాంతి లతో గతంలో వివాదాలు, గొడవలు జరిగినట్లు సమాచారం. ఈ కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన నవీన్, బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో అన్నారం గ్రామంలోని తన స్వగృహంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మాలోత్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, పూర్తి వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

## వివాహిత ఆత్మహత్య

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 29**
బీబీపేట మండలంలోనీ జనగామ గ్రామానికి చెందిన మోకిర అనూష (21) తండ్రి బాల మల్లయ్య. మూడు నెలల క్రితం అనూష కు రాజశేఖర్ తో వివాహం జరిగింది. అయితే పెళ్లి ఇష్టం లేకపోవడంతో బుధవారం సాయంత్రం అనూష ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి బాల మల్లయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది అని ఎస్ ఐ కొండా విజయ్ తెలిపారు. అనుష మృతి పై ఏలాంటి అనుమానం లేదని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడీనీ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.



# ముగిసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

**గాంధారి, జనవరి 29 (ప్రజాజ్యోతి)**

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీలు గాంధారి మండల కేంద్రం లో గురువారం విజయవంతంగా ముగిసినట్లు మండల అభివృద్ధి అధికారి రాజేశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా జరిగిన ఈ పోటీల్లో 9 క్లస్టర్లకు చెందిన బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో విభాగాల్లో పోటీలు నిర్వహించగా, మండల క్రీడల ఇంచార్జ్ లక్ష్మణ్ రాథోడ్ నేతృత్వంలో క్రమబద్ధంగా సాగినట్లు అధికారులు వెల్లడించారు. ఖో ఖో ఫైనల్ పోటీలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర్, గ్రామ సర్పంచ్ రేణుక--సంజీవ్ యాదవ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రేణుక చౌహాన్, విద్యాశాఖాధికారి శ్రీహరి, ఎస్.ఐ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్, ఉపసర్పంచ్ భాస్కర్ గౌడ్, ఏకలవ్య ప్రిన్సిపాల్ సురేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆకుల లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్ రాథోడ్, నాగ్లూర్ సర్పంచ్ సంతోష్, యువనాయకులు సర్దార్, ఉపాధ్యాయులు బాలకృష్ణ, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని ఎంపీడీఓ రాజేశ్వర్ తెలిపారు.మండల స్థాయి విజేతలు ఇలా ఉన్నారు.వాలీబాల్



(బాలురు): ప్రథమ -- పెట్ సంగం, ద్వితీయ -- సోమారం,వాలీబాల్ (బాలికలు): ప్రథమ -- పెట్ సంగం, ద్వితీయ -- పోతంగల్,కబడ్డీ (బాలురు): ప్రథమ -- పెట్ సంగం, ద్వితీయ -- గాంధారి,కబడ్డీ (బాలికలు): ప్రథమ -- గాంధారి, ద్వితీయ -- పోతంగల్, ఖో ఖో (బాలురు): ప్రథమ -- గండివెట్, ద్వితీయ -- చద్మల్,ఖో ఖో (బాలికలు)- ప్రథమ -- గండివెట్, ద్వితీయ -- పెట్ సంగం,క్రీడా పోటీలతో విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరుగుతోందని, భవిష్యత్తులో ఇలాంటి పోటీలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## సీఎం కప్ మండల స్థాయి పోటీలు ప్రారంభం





**రామారెడ్డి జనవరి 29 (ప్రజా జ్యోతి)**

రామారెడ్డి మండల కేంద్రంలో గురువారం మండలస్థాయి సీఎం కప్ పోటీలను తాసిల్దార్ ఉమలత, ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, ఆర్ఐ రవికాంత్,ఎంఈఓ ఆనంద్ రావు,మండల స్థాయి అధికారులు, ఘనంగా ప్రారంభించారు. నేడు వాలీబాల్ అండర్ 18 లోబాలుర వాలీబాల్ విన్నర్స్ జగదాంబ తండా,రన్నర్స్ ఉప్పల్వాయి,బాలికల వాలీబాల్ విన్నర్స్ అన్నారం గ్రామం టీం, రన్నర్స్ మోషశీపూర్ గ్రామం పాల్గొన్నారు. అదేవిధంగా ఫుట్బాల్ అండర్ 14 బాయ్స్ విన్నర్స్ రామారెడ్డి,రన్నర్స్ అన్నారం,ఫుట్బాల్ అండర్ 16 గర్ల్స్ విన్నర్స్ అన్నారం,రన్నర్స్ రామారెడ్డి, క్రీడాకారులు గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**గాంధారి, జనవరి 29 (ప్రజాజ్యోతి)**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధారి మండల కమిటీ చొరవతో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం 2026 సంవత్సరానికి సంబంధించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గాంధారి తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎస్.ఐ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ మమ్మాయి రేణుక--సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ బండారి పరమేశ్వర్, వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ తూర్పు రాజులు ఈ కార్యక్రమంలో పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు నేరెళ్ల సంతోష్ మాట్లాడుతూ బీసీ వర్గాల సంక్షేమం, హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం దిశగా బీసీలను సంఘటితం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సిందే నితిన్, గంగి రవి, వీడిసి చైర్మన్ ఆకుల రామస్వామి, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చీమలవార్ శ్రీనివాస్, దొల్లు లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీలు నస్కంటి రవి, రాకేష్,




సామల రాజు, టౌన్ ఉపాధ్యక్షులు, సెక్రటరీలు తాటిపాముల శివ, అరెకటిక మోతిలాల్, తూర్పు రమేష్, యూత్ ఉపాధ్యక్షులు పనుకంటి నవీన్, నాయకులు ఆకుల చంద్రశేఖర్, ఆకుల బాలకిషన్, ఎంద్రాల గోపాల్, రోడ్డ అర్జున్ రెడ్డి, సంగని బాబా, జంగం సంతోష్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



**నాగిరెడ్డిపేట్,జనవరి29(ప్రజాజ్యోతి):**

నాగిరెడ్డిపేట్ మండలానికి సంబంధించి మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను నేటి నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మైదానంలో ఖోఖో,కబడ్డీ పోటీలు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాల్ పెట్ మైదానంలో వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.మండల పరిధిలోని ఐదు క్లస్టర్లలో గత రెండు రోజులుగా గ్రామస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించామని,అందులో నుంచి మండల స్థాయికి క్రీడాపోటీలను ఎంపిక చేశామని,మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అందరూ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాల మైదానంలో హాజరవ్వాలని ఆయన కోరారు. ఖోఖో,కబడ్డీ,వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలకు చెందిన ఎంపికైన క్రీడాకారులు తప్పనిసరిగా పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## మండల సమాఖ్య విధులు బాధ్యతలపై శిక్షణ

**గాంధారి, జనవరి 29 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పారాణి అధ్యక్షతన, ఏపీఎం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మండల సమాఖ్య సమగ్ర నిర్మాణం, విధులు--బాధ్యతలపై రెండవ రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని సీనియర్ సీఆర్‌పీలు శోభారాణి, నాగశ్రీ నిర్వహించగా, ముఖ్య అతిథులుగా అడిషనల్ డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఐబి డీపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల సమర్థ నిర్వహణకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు, మండల సమాఖ్య కార్యదర్శి అంబలక్ష్మి, కోశాధికారి కవిత, సీసీలు గొర్రె రాములు, రాజేశ్వర్, రాజయ్య, రమేష్, కాశీనాథ్ గౌడ్, సౌజన్య, శేఖర్, అకౌంటెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.మండల సమాఖ్య కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.




## కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించిన సర్పంచ్ రేణుక-సంజీవ్ యాదవ్, ఎంఈఓ శ్రీహరి



**గాంధారి, జనవరి 29 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని గురువారం గ్రామ సర్పంచ్ మమ్మాయి రేణుక--సంజీవ్ యాదవ్ మరియు మండల విద్యాశాఖాధికారి శ్రీహరి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన సౌకర్యాలు, వసతి తదితర మౌలిక వసతులను వారు పరిశీలించారు.సర్పంచ్ రేణుక విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి, భోజనం నాణ్యత, చదువులో ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులందరూ పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.పాఠశాలలో మంచి భోజనం, వసతి, అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యా పరంగా ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.వారి సందర్శనతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, చదువుపై మరింత దృష్టి కేంద్రీకరించేందుకు ఇది ప్రేరణగా నిలిచిందని పాఠశాల సిబ్బంది తెలిపారు.

# రైతు ఫార్మాట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**రామారెడ్డి జనవరి 29 (ప్రజా జ్యోతి)**



రామారెడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో గురువారం రైతు రిజిస్ట్రీ (రైతు గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ) నిర్వహించారు. రైతులందరూ బాధ్యతాయుతంగా కచ్చితంగా ప్రభుత్వ ఐడెంటిటీ నంబర్ ను నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డుకు లింకు ఉన్న మొబైల్ నెంబర్,ఆధార్ కార్డుపట్టా పాస్‌బుక్, తీసుకురావాలని తెలిపారు. ఈ యొక్క రైతు ఫార్మాట్ ఉచితంగా చేయబడుతుంది. ఇట్టి అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లాంటి పిఎం కిసాన్ పథకం ఇలా అనేక రకాల పథకాలు పొందడానికి రైతులకు రైతు ఫార్మాట్ కచ్చితంగా చేయించుకోవాల్సిందని తెలిపారు.ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు ప్రస్తుతం నమోదు చేసుకోవలసిన అవసరం లేదని ఏ ఈ ఓ రాకేష్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దానాలకు కార్యరూపం కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం

### భీంగల్‌లో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు

**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి జనవరి 29**

నిజామాబాద్ జిల్లా భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ, 10వ వార్డులలో బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ చొరవతో టి యు ఐ ఎఫ్ డి నిధుల నుంచి రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భీంగల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జె.జె. నర్సయ్య పర్యవేక్షణలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు సక్రమంగా అమలవుతున్నాయని నాయకులు తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులే కాంగ్రెస్ పార్టీ పనితీరుకు నిదర్శనమని పేర్కొంటూ, మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలుపొందిన అనంతరం పట్టణ అభివృద్ధికి మరిన్ని కీలక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. మాట మీద నిలబడి పనిచేసే నాయకులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పర్స అనంతరావు (ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు), మాజీ కౌన్సిలర్ సిహెచ్. గంగాధర్, చెప్పల రాజన్న, బందుక్, చింతలూరి దశరథ్,



చెప్పల నర్సయ్య, రూపాల నర్సయ్య, చెప్పల కాంతయ్య, సేవాలాల్, చెప్పల కర్ణం, పత్రి కిషన్, చింతలూరి గంగాధర్, జంగిడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజుకు చేరిన ఆటల పోటీలు



**ఇందల్వాయి, జనవరి 29,( ప్రజా జ్యోతి న్యూస్ ):**

మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెండో ఎడిషన్ సీఎం కప్ -2026 క్రీడ పోటీలు రెండో రోజు అత్యంత ఉస్సాంగా కొనసాగాయి. ఈ పోటీలను ఎంపీడీవో అనంతరావు మరియు గ్రామ సర్పంచ్ లోకాని గంగమణి,గంగారాం గారు సందర్శించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సర్పంచ్ లోకాని గంగామణి, గంగారాం గారు టాస్ వేసి ఖో ఖో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని యువత సెల్ ఫోన్ లకు పరిమితం కాకుండా మైదానంలోకి వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం కప్ వంటి పోటీలు గ్రామీణ క్రీడాకారులకు వరం లాంటివని ఇందల్వాయి మండల క్రీడాకారులు జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో మెరవాలని ఆకాంక్షించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన జట్లు ఖో ఖో, వాలీబాల్ విభాగాల్లో తలపడ్డాయి. క్రీడాకారులు ప్రదర్శించిన పోరాటపటిమ ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, సర్పంచ్ ఫోరంల అధ్యక్షుడు సుదర్శన్, వివిధ గ్రామాల సర్పంచులు జీకే తాండ సర్పంచ్ మహిపాల్, రాజు, రోహిత్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



## ఏకాభిప్రాయ తీర్మానం చేసే వరకు ఇంటి నిర్మాణ పనులు నిలిపివేయాలి

**-ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**



**నాగిరెడ్డిపేట్,జనవరి29(ప్రజాజ్యోతి):**

నాగిరెడ్డిపేట్ మండలంలోని జప్తి జానకంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ భవనంకు అనుకొని ఉన్న పంచాయతీ స్థలంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ చేపడుతుండడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఇంచార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ గ్రామానికి వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన జోడు దుర్గయ్య తన ఇంటి పక్కనే గల గ్రామపంచాయతీ స్థలంను ఆనుకోని ఇంటి నిర్మాణం చేపడుతుండడంతో ఇంటి నిర్మాణం పై గ్రామస్తుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి ఏకాభిప్రాయ తీర్మానం చేసే వరకు ఇంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని సదరు వ్యక్తికి సూచించి,పంచాయతీ కార్యదర్శి శంకర్ కు ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**రాజంపేట జనవరి 29 (ప్రజా జ్యోతి)**



రాజంపేట మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు గాంధీ చౌరస్తా, ఎస్సీ కాలనీ, పిట్లగల్లి, కుమ్మరి గల్లీ ప్రాంతాల్లో ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ రాజంపేట అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**నాగిరెడ్డిపేట్,జనవరి29(ప్రజాజ్యోతి):**

పీఆర్టీయూ తెలంగాణ 2026 సంవత్సర నూతన క్యాలెండర్ ను బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాల్ పెట్ లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు రాము పటేల్ మాట్లాడుతూ పిఆర్టియు తెలంగాణ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటుందని,రాష్ట్రంలో పేరుకుపోతున్న ఉపాధ్యాయ సమస్యలపై క్షేత్రస్థాయి సమీక్షకు ఫిబ్రవరి 5న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి కామారెడ్డి జిల్లా కేంద్రంకు రానున్నారని,అక్కడ ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల ప్రధాన కార్యదర్శి సభాత్ కృష్ణ ,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాంరెడ్డి,పాఠశాల ఉపాధ్యాయ బృందం సంఘం సభ్యులు సిఆర్పిలు పాల్గొన్నారు.



# ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

## పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల--కళాశాల సిరికొండలో అవగాహన కార్యక్రమం




**నిజామాబాద్ రూరల్: జనవరి, 29( ప్రజాజ్యోతి)**

సిరికొండపీఎం శ్రీ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల, సిరికొండలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ గడ్డం రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విశ్వవిద్యాలయానికి చెందిన డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ నుండి డాక్టర్ మావురపు సత్యనారాయణ (హెచ్ఓడి),డాక్టర్ వాసం చంద్రశేఖర్ (అసోసియేట్ ప్రొఫెసర్),డాక్టర్ శరత్ (అసిస్టెంట్ ప్రొఫెసర్)ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసం చంద్రశేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు మూడు ఇంటిగ్రేటెడ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవిఫార్మాసిటికల్ కెమిస్ట్రీ,ఎంబీఏ,ఎకనామిక్స్ అని వివరించారు.
ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించే సిపిజి సిఈటి ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కోర్సుల ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఫార్మా ఇండస్ట్రీస్, ప్రైవేట్ రంగం, ప్రభుత్వ ఉద్యోగాలు వంటి రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. విద్యార్థులు తమ ఆసక్తి, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని సరైన కోర్సును ఎంపిక చేసుకోవాలని, ఇప్పటినుంచే స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడల్లో జట్ల ప్రతిభ




**రాజంపేట జనవరి 29 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం జరిగిన ఖో--ఖో, వాలీబాల్ పోటీల్లో వివిధ గ్రామాల జట్లు ప్రతిభ కనబరిచాయి. ఖో--ఖో బాలుర విభాగంలో రాజంపేట జట్టు ప్రథమ స్థానం సాధించగా, కొండాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో తలమడ్ల జట్టు విజయం సాధించగా, రాజంపేట జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. వాలీబాల్ బాలుర విభాగంలో అన్నారం తండా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, కొండాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల వాలీబాల్ విభాగంలో తలమడ్ల జట్టు ప్రథమ స్థానాన్ని సాధించగా, రాజంపేట జట్టు ద్వితీయ స్థానాన్ని పొందింది. విజేత జట్లను క్రీడా నిర్వాహకులు అభినందించారు. ఈ పోటీలు గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీస్తున్నాయని తెలిపారు.

# రెండో రోజు కొనసాగిన నామినేషన్ల పర్వం.









## 72 నామినేషన్లు దాఖలు.

**బోధన్ జనవరి 29 (ప్రజాజ్యోతి)**

బోధన్ మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ రెండో రోజు కొనసాగింది. మొత్తం 38 వార్డులకు కలిపి 72 నామినేషన్ పత్రాలను వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి అనుచరుల రాకపోకలతో వాతావరణం సందడిగా మారింది. అయితే చివరి రోజున మరింత మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎక్కడా గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం శాంతియుతంగా కొనసాగేందుకు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రజా జ్యోతి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కార్యదర్శి, ఐకేపీ సీసీ.





**కమ్మర్ పల్లి జనవరి 29 .ప్రజా జ్యోతి.**

కమ్మర్ పల్లి మండలం నాగపూర్ కార్యదర్శి కే. సంధ్య, కమ్మర్ పల్లి సీసీ గంగా లలిత లు గురువారం రోజున తమ కార్యాలయలలో ప్రజా జ్యోతి క్యాలెండరు ఆవిష్కరిచారు. ఈ కార్యక్రమం లో కారోబార్ రవి, వి ఓ విజయ, ప్రియాంక పాల్గొన్నారు.

# ధర్పల్లిలో క్రీడల పోటీలు ప్రారంభం



**ధర్పల్లి: జనవరి/ 29 ( ప్రజా జ్యోతి)**

ధర్పల్లి మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడల పోటీల ను ఎంపీడీవో లక్ష్మారెడ్డి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ
ఈ పోటీలు మూడు రోజులు పాటు జరుగుతాయి కబడ్డీ, కోకో, వాలీబాల్ ఆటలు నిర్వహించబడతాయని మారుమూల ప్రాంతంలో ఉన్న క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి మారుముల ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులే గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు ఉన్నారు అలాంటి వారిని గుర్తించి వారిని ఇంకా పై స్థాయి తీసుకుపోవడానికి ఈ ఆటలు ఉద్దేశించినవని ఎంపిడిఓ లక్ష్మారెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూరు చిన్న బాలరాజు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

## నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.1,810 నగదు స్వాధీనం



**నిజామాబాద్ రూరల్: జనవరి, 29 ( ప్రజా జ్యోతి)**

సిరికొండ మండలంలోని మైలారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న నమ్మకమైన సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సిరికొండ ఎస్సై జయ రామకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో వారి వద్ద నుంచి రూ. 1,810 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పేకాట వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేస్తాయని అన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా పేకాట నిర్వహించినా లేదా ఆడినప్పటికీ కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై జయ రామకృష్ణ హెచ్చరించారు.